క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. రెవెన్యూ కాలనీ, ప్రగతినగర్, నాగేంద్రనగర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు, కాజీపేటలోని సోమిడి విష్ణుపురి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ పేర్కొన్నారు.

డాక్టర్ రవీందర్‌కు సన్మానం

ఖిలా వరంగల్: ఎస్ఆర్ విశ్వవిద్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మధ్యకోటకు చెందిన కొప్పుల రవీందర్‌కు ఇటీవల రాజస్తాన్ సన్ రైస్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. ఆదివారం మధ్యకోటలో రవీందర్‌ను కొప్పుల బ్రదర్స్ పరపతి సంఘం ప్రతినిధులు కొప్పుల క్రాంతి, నాగరాజు, శ్రీధర్, శ్రీను, వీరేశం, శివ, సురేష్, రాజేష్, మున్నీ, రమేష్, శివ, గణేష్, రాము మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు.

చిల్డ్రన్స్ పార్కు ప్రారంభం

కాజీపేట: నగరంలోని 63వ డివిజన్ విద్యానగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన చిల్డ్రన్స్ పార్కును ఆదివారం కార్పొరేటర్ విజయశ్రీ ప్రారంభించారు. ఆస్కి సంస్థ పర్యవేక్షణలో చిన్నపిల్లలకు అనుగుణంగా పార్క్‌ను సుందరంగా నిర్మించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సయ్యద్ రజాలీ, కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు హెలెన్ తోయ్, హుస్సేన్, నర్సింగ్, హరి, వంశీధర్ రెడ్డి పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ఫాతిమానగర్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జికి సమాంతరంగా ఇరువైపుల రూ.48 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం కార్పొరేటర్ ఎలకంటి రాములు పరిశీలించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఇటీవల పడిన వర్షాలకు అధ్వానంగా మారిన రోడ్లను పరిశీలించి వెంటనే పనులను చేపట్టి పూర్తి చేయాలని సూచించారు.

పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు



హన్మకొండ: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని శ్రీ చైతన్య పాఠశాల జోనల్ అకాడమిక్ కో ఆర్డినేటర్ మహేష్ అన్నారు. ఆదివారం నక్కలగుట్టలోని పాఠశాల ఆవరణలో హరిత భారత్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మహేష్ పాల్గొని మాట్లాడుతూ చెట్లు మనకు జీవనాధారమని, మానవ మనుగడకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సురేఖ, డీన్ ఉదయ్‌భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

హన్మకొండ అర్బన్ : నగరంలోని ప్రశాంత్‌నగర్ కాలనీ మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గంను ఆదివారం తారా గార్డెన్‌లో ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా ఆకులకుమార్, అధ్యక్షులుగా సుంకరి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి బర్ల జగదీష్, ఉపాధ్యక్షులుగా తూల రవి, పుప్పాల మహేందర్, జాయింట్ సెక్రటరీలుగా వాసం శ్రీనివాస్, బాశెట్టి హరిప్రసాద్, కోశాధికారిగా సూర కుమారస్వామి ఎన్నికైనట్లు తెలిపారు.

లైబ్రరికీ పుస్తకాల అందజేత

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు, పూర్వ రిజిస్ట్రార్ పురుషోత్తంరావు తన వద్ద ఉన్న విలువైన జంతుశాస్త్రం, సెరికల్చర్‌కు సంబంధించిన పాఠ్య పుస్తకాలను యూనివర్సిటీలోని కేంద్ర గ్రంథాలయానికి అందజేశారు. ఈ పుస్తకాలు విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటాయని పురుషోత్తంరావు ఆదివారం తెలిపారు. కేయూ లైబ్రరీ అసిస్టెంట్ తేజావత్‌కు ఆయన ఆయా పుస్తకాలను అందజేశారు.

దూరవిద్యతో లక్ష్యాలను చేరుకోవచ్చు



కేయూ క్యాంపస్: దూరవిద్య ద్వారా తమ లక్ష్యాలను చేరుకోవచ్చని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం సాయంత్రం కేయూలోని దూరవిద్య కేంద్రం జాఫర్ నిజాం సెమినార్ హాల్‌లో నిర్వహించిన సర్టిఫికెట్ల ప్రదా నోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చదువును మధ్యలో ఆపేసిన వారికి మళ్లీ చదువుకునేలా దూరవిద్య అందుబాటులో ఉందన్నారు. గాత్రసంగీతం, మిమిక్రీలో శిక్షణ పొందిన విద్యార్థులకు రిజిస్ట్రార్, పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

హన్మకొండ కల్చరల్ : బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..



హన్మకొండ చౌరస్తా: నివాళులర్పిస్తున్న అజీజ్‌ఖాన్



హన్మకొండ : ఏకశిల పార్కు వద్ద బీఆర్ఎస్ నేతలు



మడికొండ : మహిళా ప్రాంగణంలో..



జయశంకర్ ఆశయాలు కొనసాగించాలి

తెలంగాణ ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పిన మహానేత ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని పలువురు వక్తలు అన్నారు. ఉద్యమస్ఫూర్తి, ఆయన సేవలను మనం ఎప్పటికీ మరువద్దని, జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని సూచించారు. సార్ కలలు గన్న తెలంగాణ మనకు సిద్ధించిందన్నారు. ఆదివారం జయశంకర్ జయంతి సందర్భంగా మండల నగరంలోని పలు కూడళ్లలో, కాలనీల్లో జయశంకర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలకు చెందిన ముఖ్యనాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



హన్మకొండ అర్బన్ : ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ



మామునూరు : జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ



కాజీపేట అర్బన్ : నివాళులర్పిస్తున్న తహసీల్దార్



కేయూ క్యాంపస్ : ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో



ఎంజీఎం : ఎంజీఎంలో ..



కేయూ క్యాంపస్ : కేయూలో..



కాశిబుగ్గ : ఆయుర్వేద ఆస్పత్రి వద్ద..



వరంగల్ : మాట్లాడుతున్న చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి

పుస్తక ఆవిష్కరణ



కాజీపేట అర్బన్ : హనుమకొండలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించిన బహుజన బావుటా, నేను సావిత్రిబాయి పూలే మాట్లాడుతున్నాను అనే పుస్తకాలను సాహిత్య అకాడమీ సూపరింటెండెంట్ బాలాచారి ఆవిష్కరించారు. తొలుత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. అకాడమీ ఆధ్వర్యంలో నేటి తరానికి స్ఫూర్తినిచ్చేందుకు వనపట్ల సుబ్బయ్య రచించిన బహుజన బావుటా దీర్ఘకావ్యం, దామెర రాములు రచించిన నేను సావిత్రి బాయి పూలే మాట్లాడుతున్న రచనలను ప్రచురించామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీపీ ప్రసాద్, రిటైర్డ్ ప్రొఫెసర్ సాంబయ్య, స్టడీ సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జయశంకర్ ఎండోమెంట్ లెక్చర్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఆచార్య జయశంకర్ ఎండోమెంట్ లెక్చర్‌ను ఈనెల 8న ఉదయం 11 గంటలకు క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలోని సెనేట్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ది తెలంగాణ ప్రాబ్లమ్ హిస్టారిక్ పర్స్పెక్టివ్ అనే అంశంపై హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ హిస్టరీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు అడపా సత్యనారాయణ స్మారక ఉపన్యాసం చేస్తారని తెలిపారు. వీసీ రమేష్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో జయశంకర్ మెమోరియల్ ఫౌండేషన్ ట్రస్ట్ అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్‌తో పాటు ఇతర సభ్యులు పాల్గొంటారని తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

గద్దర్ మృతి విప్లవోద్యమానికి తీరని లోటు

వరంగల్ అర్బన్ : ప్రజాకవి, గాయకుడు, బడుగు, బలహీన వర్గాల విప్లవస్ఫూర్తి గద్దర్ మృతి విప్లవోద్యమానికి తీరని లోటని నగరమేయర్ గుండు సుధారాణి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన కవిత్వం ముఖ్యపాత్ర పోషించిందన్నారు. తన పాటల ద్వారా ఎంతో మందిని గద్దర్ ప్రభావితం చేశారని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మేయర్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

హన్మకొండ: ప్రజా గాయకుడు గద్దర్ మృతి తననెంతో కలచివేసిందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. గద్దర్ మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వరంగల్: గద్దర్ ఆకస్మిక మరణం ప్రజాఉద్యమాలకు తీరని లోటని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. గద్దర్ మృతి పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి జోహార్లు అర్పించారు. ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన పోరాటాలకు ప్రజలను చైతన్యపరచి సంఘటితం చేయడంలో వారు పాడిన పాటలు మరువలేనివి.

ఖిలా వరంగల్ : తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేపి ప్రజల్లో చైతన్యం నింపిన ప్రజాగాయకుడు గద్దర్ మృతి యావత్ సమాజానికే తీరని లోటని సామాజిక న్యాయవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం వరంగల్ ఫోర్ట్ రోడ్డుపై సామాజిక న్యాయవేదిక ప్రతినిధుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో గద్దర్‌కు నివాళులర్పించి సంతాప వ్యక్తం చేశారు. రాజేష్, భరత్, నిమ్మ హరీష్, సుమన్, శ్రావణ్, ఎండి.పాషా పాల్గొన్నారు.

హసన్‌పర్తి: తెలంగాణ ఉద్యమానికి ప్రజానౌక గద్దర్ తన ఆటపాటలతో ప్రాణం పోశారని ఆయనతో ఉన్న అనుబంధాన్ని ఇక్కడి ప్రజలు గుర్తు చేశారు.

కాశిబుగ్గ : గద్దర్ మృతి తెలంగాణ ప్రజానీకానికి తీరని లోటు అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ పోరాటంలో ప్రజా గాయకుడు గద్దర్ పాత్ర మరువలేనిదని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ జన్ను భాస్కర్ అన్నారు. కాశి బుగ్గ జంక్షన్‌లో గద్దర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో ఉదయ్‌సింగ్ నాయక్, ప్రవీణ్, వెంకటస్వామి, చంద్రమౌళి, సత్యనారాయణ ఉన్నారు.

కేయూ క్యాంపస్: ప్రజాయుద్ధ నౌక గద్దర్ మృతిపట్ల సంతాపం తెలియజేస్తూ కాకతీయ యూనివర్సిటీలోని ఆల్‌మాల స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కేయూ మొదటి గేట్‌వద్ద నివాళులర్పించారు. డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హన్మకొండ: గద్దర్ మృతి పట్ల దళిత బహుజన వర్గాలకు తీరని లోటని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ పేర్కొన్నారు. బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిలి సంతాపం తెలిపారు.

మడికొండ: గద్దర్ మృతికి సంతాపంగా మడికొండలో పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ హన్మకొండ జిల్లా అధ్యక్షుడు పల్లపు మధు ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో ఫ్యాన్స్ మండల అధ్యక్షుడు దాసరి వీరేష్, వంశీ, శరత్, మహేష్, రాజేందర్, రాఖీ, శ్రీకాత్, బండ రాజు పాల్గొన్నారు.



ఖిలావరంగల్ : కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న సామాజిక న్యాయవేదిక ప్రతినిధులు



కాశిబుగ్గ : జంక్షన్‌లో గద్దర్ చిత్రపటం వద్ద..

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

వరంగల్ చౌరస్తా : వరంగల్ హంటర్‌రోడ్డు ఎన్‌టీఆర్‌నగర్, సంతోషిమాత కాలనీ, సాయినగర్‌లలో ఇటీవల భారీ వరదల వల్ల ఆస్తి నష్టం సంభవించిన బాధితులకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన నవీన్, సుఖీభవ ఫౌండేషన్, ఫలనీ సేవాదళ్ ఆధ్వర్యంలో హంటర్‌రోడ్డులో జరిగిన ఈ కార్యక్రమానికి వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ ముఖ్య అతిథిగా హాజరై సుమారు 400 మంది పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందచేశారు. కార్యక్రమంలో మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లు, రవీంద్ర నాథ్, అనిల్, వెంకన్న, రవికుమార్, మధు, సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యారణ్యపురి: వరదలతో నష్టపోయిన బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేసినట్లు హనుమకొండలోని సైకిల్‌వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగాగోపాల్ రెడ్డి జంగా గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పబ్లిక్ గార్డెన్‌నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా జవహర్‌నగర్‌కాలనీ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి పి.అనంత్, కోశాధికారి పి రమేష్, డాక్టర్ సాంబమూర్తి, సలహాదారులు వేణుగోపాల్, ఇతర బాధ్యులు పాల్గొన్నారు.



వరంగల్ చౌరస్తా : బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న వరంగల్ ఏసీపీ కిషన్

బాధిత కుటుంబానికి పరామర్శ

మామునూరు: టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ రిటైర్డ్ ఆర్ఎస్సై కె.సారయ్య (68)శనివారం రాత్రి మట్టెవాడలోని ఆయన స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న టీఎస్ఎస్పీ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి అధ్యక్షుడు రంగరాజు ప్రకాశ్, ఉపాధ్యక్షులు చెలమల సత్తయ్య, జనరల్ సెక్రటరీ ఇనుగాల జోగిరెడ్డి ఆదివారం సారయ్య మృతదేహాన్ని సందర్శించారు. అనంతరం వారు భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో జి.కుమారస్వామి, మధుసూదన్ గౌడ్, కె.సూరయ్య, మధుకర్, అశోక్ తదితరులు ఉన్నారు.

మనల్ని మనం రక్షించుకోవాలి

ఖిలా వరంగల్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా మనల్ని మనమే రక్షించుకోవాలని కార్పొరేటర్లు ముస్కమల్ల అరుణ, దిడ్డి కుమారస్వామి, బైరబోయిన ఉమ, వేల్పుగొండ సువర్ణ, పోశాల పద్మ, సిద్దం రాజు సూచించారు. మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం మీ కోసం 10 గంటల 10 నిమిషాల కార్యక్రమంలో భాగంగా వరంగల్ నగరంలోని 33, 34, 37, 38, 39, 41 డివిజన్లలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, మున్సిపల్ మలేరియా అధికారుల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఇంటి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఖాళీ స్థలాల్లోని నీటి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెంగీ, మలేరియాకు కారణమైన దోమల స్వైర విహారం చేయకుండా ఇంటి చుట్టూ నీరు నిల్వఉండకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సాంబయ్య, హెల్త్ ఇన్‌స్పెక్టర్ శివ, బీఆర్ఎస్ నేతలు దామోదర్ యాదవ్, బోగి సురేష్, ముస్కమల్ల అరుణ, పోశాల స్వామి, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేసిన ఇద్దరిపై కేసు

ఖిలా వరంగల్ : బ్యాంకులోన్ కమీషన్‌పై జరిగిన గొడవ, ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ఇదరి నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ సీఐ టి.సురేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన చారుగుండ్ల శ్రీనివాస్ ప్రైవేట్ బ్యాంకుల్లో లోన్స్ ఇప్పిస్తూ వచ్చే కమీషన్‌పై కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గవిచర్ల క్రాస్‌రోడ్డులోని గణేష్‌నగర్ కాలనీకి చెందిన మిరియాల శ్రీనివాస్‌కు ఇటీవల ఓ ప్రైవేట్ బ్యాంకులో లోన్ ఇప్పిస్తాడు. శనివారం సాయంత్రం వారి ఇద్దరి మధ్య బ్యాంకులోన్ కమీషన్‌పై గొడవ మొదలై దాడి వరకు దారి తీసిందన్నారు. మిరియాల శ్రీనివాస్, కటకం రంజిత్ చారుగండ్ల శ్రీనివాస్‌పై కత్తితో పొత్తికడుపులో దాడిచేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం మిరియాల శ్రీనివాస్, కటకం రంజిత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

కాజీపేట అర్బన్ : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 31వ డివిజన్ పరిధి న్యూశాయంపేటలోని పద్మశాలీ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన డివిజన్, బూత్ కమిటీ, ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పార్టీ పూర్వ వైభవానికి, ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు, ఓబీసీ అధ్యక్షుడు కుమారస్వామి, పాల్గొన్నారు.

విద్యార్థులు కీర్తిప్రతిష్టలు తీసుకురావాలి

హన్మకొండ చౌరస్తా : విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులు, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మేదరి (మహేంద్ర) ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండ రెడ్డికాలనీలోని శారద ఫంక్షన్‌హాల్ లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పది, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన మేదరి విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. సమావేశంలో స్థానిక కార్పోరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

హసన్‌పర్తి: స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హసన్‌పర్తి వాసవిక్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం కేక్ కట్ చేశారు. అలాగే మిత్రమండలి సొసైటీ (1988-89 ఎస్ఎస్‌సీ బ్యాచ్) ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు రమేష్, సురేష్, ఉపాధ్యక్షులు శంకర్, గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థినికి సైకిల్ బహూకరణ

హసన్‌పర్తి : అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థినికి స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ సైకిల్ బహూకరించారు. స్కూల్‌కు వెళ్లడానికి ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుసుకున్న కార్పొరేటర్ ఆమెకు ఆదివారం సైకిల్ అందించారు.

ఘనంగా జాగృతి ఆవిర్భావ దినోత్సవం

కాశిబుగ్గ : వరంగల్ కాశిబుగ్గలో తెలంగాణ జాగృతి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు యార బాలకృష్ణ ముందుగా జయశంకర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జాగృతి జెండా ఎగురవేసి మాట్లాడారు. జాగృతి బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

సామాజిక సేవలో వాసవీక్లబ్ ఆదర్శం

కాజీపేట అర్బన్ : సామాజిక సేవలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ఆదర్శంగా నిలుస్తుందని క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి అన్నారు. హంటర్‌రోడ్డులోని కోడం కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ మిడిల్ ఇయర్-2023 కాన్ఫరెన్స్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిరుపేద మహిళలు సాధికారత సాధించేందుకు 102 కుట్టు మిషన్లు, ఇటీవల వరదల కారణంగా మోరంచపల్లిలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశామ న్నారు.

వద్దిరాజుకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి

రామన్నపేట : త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా తెలంగాణ ఉద్యమకారుడు, న్యాయవాది వద్దిరాజు గణేష్‌కు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని బ్రాహ్మణ ఐక్యవేదిక కన్వీనర్ వద్దిరాజు వెంకటేశ్వరావు కోరారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బ్రాహ్మణుల పాత్రను గుర్తించి అనేక సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు.

సంక్షేమ బోర్డు కోసం ఒత్తిడి తేవాలి

హసన్‌పర్తి : తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వంపై ఎమ్మెల్యే ఒత్తిడి తీసుకురావాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు బాషబోయిన రవీందర్‌యాదవ్ కోరారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రస్తావించడంపై కృతజ్ఞతలు తెలిపారు.ఎర్రగట్టు క్రాస్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు ప్రతి నెలా రూ.10వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమ ద్రోహులకు పదవులు అప్పగించి, ఉద్యమకారులను కూలీలుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల కుమార్, హసన్‌పర్తి మండల అధ్యక్షుడు రమేష్,ఉద్యమకారులు నాయకపు శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ

హసన్‌పర్తి : మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణహోమాన్ని నిరసిస్తూ ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మండలంలోని వంగపహాడ్‌లో పునీత అంథోనీ, పునర్జనా బాప్టిస్ట్ చర్చిల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఫాదర్ చిన్నప్ప, పాస్టర్ పాల్సన్, సంఘం అధ్యక్షులు దోమ కుమార్, సిలువేరు వీరస్వామి, ఇమ్మాయల్, కిశోర్, ప్రసాద్, రఘు పాల్గొన్నారు.

బచ్చయ్యగౌడ్‌కు కార్మిక వైభవరత్న అవార్డు



హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ లైన్ ఇన్‌స్పెక్టర్, తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (327) రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ మచ్చిక బుచ్చయ్యగౌడ్ కార్మిక వైభవరత్న అవార్డు అందుకున్నారు. ట్రేడ్ యూనియన్ నాయకుడిగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు చేస్తున్న కృషిని గుర్తించిన లలిత సమాఖ్య స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఆదివారం హైదరాబాద్‌లోని హరిహరా కళాభవన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో బుచ్చయ్య గౌడ్‌కు కళా సమాఖ్య ప్రతినిధులు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బుచ్చయ్య గౌడ్‌ను యూనియన్ నాయకులు అభినందించారు.

కొనసాగుతున్న సాహిత్యోత్సవాలు



హన్మకొండ కల్చరల్ : వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న సాహిత్యోత్సవాలు ఆదివారం మూడో రోజు కొనసాగాయి. సహృదయ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజామనోహరబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులు సాగి కమలాకర శర్మ, విశిష్ట అతిథులుగా కరీంనగర్‌కు చెందిన అష్టావధాని డాక్టర్ గంద్ర లక్ష్మణరావు, ధరిపల్లి రఘురామ్ పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దివంగత దరిపల్లి వేంకట నరసింహాచార్య రచించిన పురాణవైర గ్రంథమాల- జ్ఞాన విజ్ఞానం గ్రంథావిష్కరణ చేశారు.